క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ జ్యోతిప్రియ

కొత్తవలస: మండలంలోని బలిఘట్టాం గ్రామంలో కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారులు సీతల్ వర్మ,సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 305 మందికి వైద్యులు సీతల్ వర్మ,సింహాద్రినాయుడుతో పాటు గైనకాలజిస్టు పి.వరలక్ష్మి, ఆప్తాలమిక్ డాక్టర్ జ్యోతిప్రియ వైద్యసేవలందించారు. ఇద్దరిని కంటి ఆపరేషన్లకు రిఫర్ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది ఓ.నరసింహారావు, రమణమ్మ, బేబీరాణి, సూరిదేముడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠరాజపురంలో ..



నీలకంఠరాజపురంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ధరణి

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఏ.ధరణి ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 404 మందికి డాక్టర్ ధరణి, స్త్రీ వైద్య నిపుణులు ఏ.నీల, కీళ్ల వైద్యనిపుణులు ఎస్.ఆచారి, ఆప్తాలమిక్ ఈశ్వరరావు సేవలందించారు. ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాజేష్

వేపాడ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలంతా సహకరించాలని వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ కోరారు. రాయుడుపేటలో మంగళవారం సాయంత్రం ప్రజలకు ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో లేనిపోని గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

పాఠశాలల్లో శ్లాస్ సర్వే



శ్లాస్ సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓలు

వేపాడ: ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నైపుణ్యాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే(శ్లాస్)ను మంగళవారం నిర్వహించారు. సర్వేలో భాగంగా దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పరీక్షను ఎంఈఓలు జగదీశ్వరరావు, భాలబాస్కరరావు పరిశీలించారు. ఈసర్వేను తెలుగు, ఇంగ్లిష్, గణితం విభాగాల్లో ఓఎమ్మార్ ద్వారా చేపట్టారు. అలాగే విద్యార్థుల, ఉపాధ్యాయులు హాజరు, వర్క్ బుక్స్, లెసెన్ ప్లాన్‌ను ఎంఈఓలు పరిశీలించారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



సర్టిఫికెట్లతో విద్యార్థినులు

గంట్యాడ: దక్షిణ భారత హిందీ ప్రచారసభ వారు నిర్వహించిన ప్రాథమిక, మధ్యమ హిందీ పరీక్షల్లో మండలంలోని కొఠారుబిల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన పరీక్షల్లో 45 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఈమేరకు దక్షిణ భారత హిందీ ప్రచారసభ వారు పంపించిన ఉత్తీర్ణ సర్టిఫికెట్లు విద్యార్థినులకు మంగళవారం అందాయి. విద్యార్థినులకు కేజీబీవీ ఎస్‌ఓ అల్లు జ్యోతి అభినందించారు.

ఉపాధి పనుల పరిశీలన

మెరకముడిదాం: ఎం.రావివలస గ్రామంలోని పాపినాయుడు చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆ పథకం ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ మంగళవారం పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్నవారే పనులకు హాజరు కావాలని, ఒకరి పేరుపై వేరొకరు హాజరు కాకూడదన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు ఉన్నారు.

కొత్త ఊరు వెలసింది...

- చీపురుపల్లి పట్టణంలో జగనన్న లేఅవుట్
- 570 మందికి పక్కా గృహాలు మంజూరు చేసిన ప్రభుత్వం
- లేఅవుట్‌లో రోడ్లు, విద్యుద్దీకరణ, తాగునీరు సదుపాయం



చీపురుపల్లి సంగువారిమెట్టలో జగనన్న కాలనీలో పేదలు నిర్మించుకున్న ఇళ్లు



జగనన్న కాలనీలో చేపట్టిన విద్యుద్దీకరణ పనులు

చీపురుపల్లి: పాలకులకు మంచి మనస్సు ఉంటే పేదలకు ఎంత మంచి జరుగుతుందో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో నిరూపితమైంది. గతంలో చంద్ర బాబు 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నడూ ఇలాంటి సంక్షేమ పరిపాలన మచ్చుకైనా కనపడలేదు. కానీ 2019 నుంచి 2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమం అమలు చేసింది. సొంతిల్లు ఉండాలనేది ప్రతి పేదోడి కల. ఆ కలను సీఎం జగన్ సాకారం చేశారు. చంద్రబాబు పాలనలో ఊరికి ఒకటో రెండో, మూడో ఇళ్లు మంజూరయ్యేవి. అరకొరగా మంజూరు చేసిన ఇళ్లకు సైతం లబ్ధిదారుల నుంచి జన్మభూమి కమిటీలు, నాయకులు లంచాలు వసూలు చేసేవారు. అయితే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు అనే పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఉండాలనే ఆశయంతో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. సీఎం జగన్ సంకల్పంతో కొత్త ఊర్లే వెలసాయి. దీని కోసం ఎంత ఖర్చు అయినా వెనుకాడలేదు.ఎంతో మంది పేదలసొంతింటి కల నెరవేరింది. జీవితాంతం కలగానే ఉండి పోతుందనుకున్న తమ సొంతింటి కల జగన్ పుణ్యమా అని సాకారమైందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కాలనీలో ఇంటింట కుళాయిలు

570 మందికి పక్కా గృహాలు

నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లి పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేసేందుకు పట్టణంలోని జి.అగ్రహారం పరిధిలో గల సంగువారిమెట్ట వద్ద ప్రభుత్వం భూసేకరణ చేసింది. కోట్ల రూపాయలు వెచ్చించి జిరాయితీ భూములు కొనుగోలు చేసింది. ఈభూములను జగనన్న లేఅవుట్‌గా ఏర్పాటు చేసి దాదాపు 800 వరకు ఇళ్ల పట్టాలు సిద్ధం చేశారు. అందులో 570 మంది పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు పక్కా గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంకా 150 పక్కా గృహాలు మంజూరు స్థాయిలో ఉన్నాయి. ఇక్కడి జగనన్న కాలనీలో రహదారులతో పాటు విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు చేశారు.

నా కూతురి కల నిజమైంది



మాది గుర్ల మండలంలోని నాగల్లవలస గ్రామం. నా కుమార్తె పిన్నింటి లక్ష్మి చాలా కాలంగా చీపురుపల్లిలోని రిక్షాకాలనీలో అద్దె ఇంటిలో కుటుంబాన్ని గడుపుతోంది. ఎంతో కాలంగా ఎన్నో ప్రభుత్వాలు ఉన్న సమయంలో ఇంటి కోసం ప్రయత్నించినా మంజూరు కాలేదు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక నా కూతురుకు పక్కా ఇల్లు మంజూరయ్యింది. సంగువారిమెట్టలో ఇల్లు నిర్మించుకున్నారు. నాకూతురి సొంతింటి కల నెరవేరింది.

– యలకల సూరమ్మ, పిన్నింటి లక్ష్మి తల్లి

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



పెదమజ్జిపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



కొండతామరపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల పాలన సాగించారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. పెదమజ్జిపాలెం, కొండతామరపల్లి, కొత్త వెలగాడ, గింజేరు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రచారసభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనలేక చంద్రబాబు పొత్తులతో వస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ సీఎం జగన్ నిత్యం ప్రజల్లో ఉంటున్నారని, ఆయనపై హత్యాయత్నం జరిగినప్పటికీ అధైర్యపడకుండా ప్రజల కోసం బస్సు యాత్రను కొనసాగిస్తున్నారన్నారు. సీఎం జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని, మండల కేంద్రాలకు వెళ్లే వ్యయ ప్రయాసలు తగ్గాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యారంగం అభివృద్ధికి సీఎం జగన్ రూ.70 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామని, నాడు-నేడులో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చామని చెప్పారు. చంద్రబాబు పాలనలో పాఠశాలలు ఎలా ఉండేవి, జగన్ పాలనలో పాఠశాలలు ఎలా అభివృద్ధి చెందాయో గుర్తించాలని ప్రజలకు సూచించారు. ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య రాజకీయ యుద్ధమని, పేదల పక్షాన నిలిచిన సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనని, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్‌లు కోడెల ముత్యాలనాయుడు, కొంచాడ నాయుడుతాత, రాజాన సూరిబాబు, ఎంపీటీసీలు ఎర్ర అప్పారావు, చప్ప ఊహ, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, నాయకులు నారాయణమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కాపుశంభాంలో కవాతు చేస్తున్న పోలీసులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గరివిడి మండలంలోని బి.జె.పాలెం, కాపుశంభాం, బొండపల్లి, గొట్టంది గ్రామాల్లో ఆర్‌పీఎస్‌ఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్.ఆర్.జాత్, గరివిడి ఎస్‌ఐ ఎల్.దామోదరరావు తెలిపారు.


రామాలయంలో ఎమ్మెల్యే పూజలు



సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన రామాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసికట్టుగా 10 నెలల్లోనే రూ.90 లక్షలతో రామాలయం నిర్మించుకోవడం గొప్ప విషయమన్నారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, సర్పంచ్ ముమ్మన ధనలక్ష్మి, నాయకులు ముమ్మన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వాకాడ గోపి, తదితరులు

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌ఎంఎస్ ఫెర్రో పరిశ్రమ యూనిట్ హెడ్ వాకాడ గోపి చెప్పారు. పట్టణంలో వంశీ, విష్ణు థియేటర్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 50 మంది కార్మికులకు మంగళవారం చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. గరివిడికి చెందిన సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను భార్య పార్వతి వర్ధంతిని పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వంశీ, విష్ణు, వైభవ్, అనురాగ్, అమోఘ్ సినిమా థియేటర్లతో పాటు రాధా మాధవ ఫంక్షన్ హాల్‌లో పని చేస్తున్న కార్మికులకు దుస్తులు అందజేశారు. గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, గరివిడి సర్పంచ్ ప్రతినిధి కుమార్, ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, డీసీసీబీ డైరెక్టర్ శివుకు కాంతారావు, సహాయ్ ప్రతినిధులు సీతారామ్, వర్మ, రాంబాబు, పక్కి శ్రీను, మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ వెంటే మేము



చీపురుపల్లి: ఎంపీడీఓ శ్వేతకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న గొల్లలములగాం సచివాలయ పరిధి వలంటీర్లు

ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన వలంటీర్ వ్యవస్థను అపహాస్యం చేస్తున్న చంద్రబాబు తీరును నిరసిస్తూ తాము జగన్ వెంటే నడుస్తామని స్పష్టం చేస్తూ రాజీనామా చేస్తున్నట్లు పలువురు వలంటీర్లు తెలిపారు. మండలంలోని గొల్లలములగాం సచివాలయం పరిధిలో వలంటీర్లు వెల్లడించారు. చీపురుపల్లి మండలంలోని గొల్లలములగాం సచివాలయం పరిధిలో 16 మంది వలంటీర్లు, గుర్ల మండలంలోని కొండగంద్రేడు గ్రామానికి చెందిన ఏడుగురు, దత్తిరాజేరు మండలంలోని పాచలవలస గ్రామానికి చెందిన 9 మంది వలంటీర్లు మంగళవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓలు డి.శ్వేత, వెంకటరమణ, చంద్రకుమారికి అందజేశారు. లక్కవరపుకోట మండల కేంద్రంతో పాటు తలారి,మార్లాపల్లి సచివాలయాలకు చెందిన వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులకు అందజేశారు.



గుర్ల: ఎంపీడీఓ వెంకటరమణకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న కొండగంద్రేడు వలంటీర్లు



దత్తిరాజేరు: రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న పాచలవలస వలంటీర్లు



లక్కవరపుకోట: రాజీనామా పత్రాలను పంచాయతీ ఈఓకు అందజేస్తున్న ఎల్.కోట సచివాలయ పరిధి వలంటీర్లు

–చీపురుపల్లి/గుర్ల/దత్తిరాజేరు/లక్కవరపుకోట

ఎన్నికల నియమావళి పాటించాలి

- ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల
- 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ శాంతి



సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి శాంతి

చీపురుపల్లి: ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ బి.శాంతి అన్నారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇప్పటికే షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. 18న నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఏప్రిల్ 25 వరకు రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్లకు విధించిన గడువులో ఎలాంటి ప్రభుత్వ సెలవు దినాలు ఉన్నా ఆ సమయంలో నామినేషన్లు స్వీకరించబడవని స్పష్టం చేశారు. 26 నుంచి నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లు సందర్భంగా ర్యాలీలు, బహిరంగ సభలు, ఊరేగింపులకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు జాతీయ, రాష్ట్ర పార్టీలకు చెందిన వారైతే ఒక్కో ప్రతిపాదితులు, ఇతర పార్టీలకు చెందిన వారైతే పది మంది ప్రతిపాదితులు ఉండాలని చెప్పారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు తప్పనిసరిగా పార్టీ నుంచి ఏ, బి ఫారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఉంటుందని తెలిపారు.

సంక్షేమ ప్రదాతను గెలిపించండి

- కోటలో వైసీపీ ప్రచారం..
- ప్రచారంలో తాజా, మాజీ ఎమ్మెల్యేలు...



ఎస్.కోటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. మంగళవారం రాత్రి ఎస్.కోట పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలకగా, మహిళలు హారతులుపట్టారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ వారి కష్టసుఖాలు తెలుసుకుని, సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు అందిన తీరు, సచివాలయాలు, వలంటీర్ల సేవలు, ఆరోగ్య సురక్ష వంటి పథకాల వల్ల జరిగిన మేలును వివరించారు.మీకు ఏం సాయం కావాలన్నా ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే హైమావతి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, స్టేట్‌ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, నాయకులు బుగత వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

కందుకూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



గజపతినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గురుకుల పాఠశాలలో కందుకూరి జీవిత విశేషాలను విద్యార్థినులకు వివరిస్తున్న తెలుగు ఉపాధ్యాయిని

గజపతినగరం: తెలుగు రచయిత, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ అన్నారు. వీరేశలింగం పంతులు జయంతిని కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి కందుకూరి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, సాహితీవేత్త అని, 130కు పైగా గ్రంథాలను రాశారని చెప్పారు.వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, అధ్యాపకులు మాధవరావు, శ్రీనివాస్, శాంతి ప్రియ, షర్మిల, విజయదుర్గ పాల్గొన్నారు.

గురుకులంలో..

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో సంఘ సంస్కర్త కుందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో, బోధనా సిబ్బంది, విద్యార్థినులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి

దత్తిరాజేరు: సకల మానవాళి, జీవులకు ప్రాణాధారమైన నీటిని పొదుపుగా వాడదామని ఎంపీడీఓ చంద్రకుమారి అన్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగానీటి వినియోగంపై స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైందని, నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఇళ్లలో వాడుక నీటిని మొక్కలకు, పెరటి కూరగాయల సాగుకు మళ్లించుకోవాలని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ మోటివేటర్ ఆర్.గోవింద్, కేజీబీవీ ఎస్‌ఓ శివజ్యోతి పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా



కొత్తవలస: కొత్తవలసలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఎంపీపీ గోపెమ్మ, జెడ్పీటీసీ శ్రీదేవి, తదితరులు



వేపాడ: గుడివాడలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు,నాయకులు



శృంగవరపుకోట: ధర్మవరంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, తదితరులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): దువ్వాం పంచాయతీలోని డీఎఫ్ఎస్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న నాయకులు



మెరకముడిదాం: ఎం.పాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింట ప్రచారం చేస్తున్నారు. నాయకులు హుషారుగా ప్రజలతో మాట కలుపుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తున్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగాలని చెబుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. మంగళవారం కొత్తవలస,మెరకముడిదాం, గరివిడి, ఎస్.కోట, వేపాడ మండలాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్